తాగునీటికి తప్పని తిప్పలు

- పెరుగుతున్న ఎండలు..అడుగంటిన భూగర్భజలాలు
- వేపలసింగారం, మిట్టగూడెం గ్రామాల్లో తాగునీటి సమస్య
- రెండు రోజులకు ఒకసారి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీరు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు


ఇంటి అవసరాలకు పశువుల తొట్టిలో నిల్వ ఉన్న నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు


వేపలసింగారంలో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న మాజీ సర్పంచ్ శిరీష

హుజూర్‌నగర్ రూరల్ : మార్చి నెల చివరి వారం నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరిగిపోతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్చి చివరి వారంలోని ఉష్ణోగ్రతలు 38డిగ్రీలకు చేరుకున్నాయంటే రానున్న రోజుల్లో పరిస్థితులు ఏ విధంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే హుజూర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. గతంలో సాగర్ కాలువల ద్వారా నీరు రావడంతో తాగు, సాగునీరు పుష్కలంగా ఉండేవి. ఈ సంవత్సరం సాగర్ జలాలు రాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఫలితంగా బోర్లు, బావులు ఎండిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అదే విధంగా పట్టణాలు, గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ఏర్పడడంతో ప్రజల నానా అవస్థలు పడుతున్నారు. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత తీవ్రంగా ఉండే అవకాశం లేక పోలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో మంచినీటి కొరత తీవ్రంగా ఉంది. మండలంలోని వేపలసింగారం, మిట్టగూడెం గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. గ్రామాల్లో దూర ప్రాంతాలకు వెళ్లి మంచినీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. గతంలో ఎన్నడు లేనివిధంగా గ్రామాల్లో మంచినీటి కొరత ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ నీటిని రెండు రోజులకు ఒకసారి సరఫరా చేస్తుండడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. 15సంవత్సరాల క్రితం ఏర్పడిన పరిస్థితులు ప్రస్తుతం కనిపిస్తున్నాయని వివిధ గ్రామాల ప్రజలు అంటున్నారు. అధికారులు సత్వర చర్యలు తీసుకొని గ్రామాల్లో మంచినీటి ఎద్దడి మరింత తీవ్రతరం కాకముందే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీరు అందిస్తున్నాం



గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మిషన్ భగీరథ నీరు రెండు రోజులకు ఒకసారి రావడంతో గ్రామప్రజలు ఇబ్బందులు పడుతున్నామని తన దృష్టికి తీసుకురావడంతో మా మామ అన్నెం వెంకటరెడ్డి జ్ఞాపకార్థంగా స్వంత ఖర్చులతో రెండు ట్యాంకర్లు ఏర్పాటు చేసి రోజుకు 60వేల లీటర్ల నీటిని వ్యవసాయ మోటర్ల నుంచి తీసుకొచ్చి ప్రజలుకు అందిస్తున్నాం.

– అన్నెం శిరీషాకొండారెడ్డి, మాజీ సర్పంచ్, వేపలసింగారం

సమస్యను పరిష్కరించేలా చూస్తాం



వేపలసింగారంలో భూగర్భజలాలు వట్టిపోయిన విషయం వాస్తవమే. గ్రామ ప్రజలకు సరిపడా నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటికి సంబంధించి బడ్జెట్ వచ్చింది. త్వరలోనే రక్షిత మంచినీటి పథకం కింద బోరు ఫ్లెషింగ్ చేయించి నీటిని అందించేలా చూస్తాం.

– లావణ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, హుజూర్‌నగర్

క్లుప్తంగా

సీనియర్ సిటిజన్స్ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

మునగాల : మండలంలోని తాడువాయిలో బుధవారం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ గ్రామ కమిటీని జిల్లా ఉపాధ్యక్షుడు ఆరె.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్ము భిక్షమయ్య, ఉపాధ్యక్షుడిగా ఎలగందుల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా లొడంగి వెంకయ్య, సహాయ కార్యదర్శిగా జిల్లేపల్లి కోటయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోడి వీరస్వామి, కోశాధికారిగా వారణాసి సత్యనారాయణ, సభ్యులుగా తోట వెంకటేశ్వర్లు, ఎలగంగుల వెంకటమ్మ, ఎలగందుల సత్యనారాయణ, ఎలగందుల లక్ష్మి, నాగార్జునపు బ్రహ్మాచారి, కొమ్ము వీరస్వామి, కొమ్ము గురులింగం, బెల్లి గుర్వయ్య ఎన్నికయ్యారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాంబాబు

చిలుకూరు : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాంబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మఠంపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా ముందస్తు నివారణ చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ ఎం.జానకిరాములు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మండలంలోని భీమ్లాతండా, క్రిష్టాతండా, రామచంద్రాపురంతండాలో పర్యటించి మంచినీటి సరఫరా పైపులైన్, బోర్లు, చేతిపంపుల మరమ్మతుల పనులు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భవన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారికి చక్రస్నానాలు


కోదాడరూరల్ : మండలంలోని తొగర్రాయిలో గల శ్రీసంతాన వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సుదర్శన నారసింహ, మూలమంత్ర హోమాలు, మహా పూర్ణాహుతి, మహా పుష్పయాగం, స్వామివారికి చక్రస్నానాలు వంటి కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు – సంధ్య దంపతులు, అర్చకులు విష్ణువర్ధన ఆచార్య, రాకేష్‌శర్మ, యాదా వెంకటేశ్వర్లు, సురేష్, హనుమంతరావు, సింగరయ్య, ఏడుకొండలు, ఉపేందర్, గోపిరెడ్డి, ఎర్రయ్య, భక్తులు పాల్గొన్నారు.

రంగారెడ్డి మృతి తీరనిలోటు


రంగారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి

గరిడేపల్లి : మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన యరబోలు రంగారెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. రంగారెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో బుధవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి ఎస్‌కె యాకూబ్, మాజీ సర్పంచ్ రాచమల్ల రామస్వామి, దోసపాటి భిక్షం, ఎరబోలు వెంకట్‌రెడ్డి, గంధం శేఖర్, సామల రాంరెడ్డి, బాలకృష్ణ ఉన్నారు.

రికార్డుల తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీఓ

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం, చౌటపల్లి, అల్లీపురం తదితర గ్రామ పంచాయతీల్లో బుధవారం మండల పంచాయతీ అధికారి ఆంజనేయులు రికార్డులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పన్నులు వందశాతం వసూలు చేసే దిశగా కార్యదర్శులు పనిచేయాలని ఆదేశించారు. ఉపాధి పనులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కోలాట పోటీలు ప్రారంభం


కోలాట పోటీల్లో పాల్గొన్న కళాకారులు

మునగాల : మండలంలోని రేపాలలో శ్రీస్వయంభూ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయం ఆవరణలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించనున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ సారిక చినరామయ్య బుధవారం తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.500ఎంట్రీ ఫీజును చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సారిక నాగరాజు, పల్లి సైదిరెడ్డి తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.20,116లను ఎంపీపీ ఎలక బిందు ప్రకటించగా, ద్వితీయ బహుమతి రూ.15,116లు దేవరగట్ల రామారావు, మూడో బహుమతి రూ.10,116లను పల్లి ఆదిరెడ్డి-రేణుక దంపతులు, నాల్గవ బహుమతి రూ.5,116లను మాజీ సర్పంచ్ పల్లి రమణ-వీరారెడ్డి దంపతులు ప్రకటించారని వారు తెలిపారు. ఆసక్తి గల కళాకారులు 95028 26769, 95055 33084ను సంప్రదించాలన్నారు.

ఘనంగా హోలీ, కామదహనం సంబరాలు


బీల్యానాయక్‌తండాలో హోలీ, కామదహనం వేడుకలు నిర్వహిస్తున్న గిరిజనులు

మఠంపల్లి : మండలంలో భీల్యానాయక్‌తండా, అంత్యాతండా, దుబ్బతండా, బోడబండతండా, బాడవాతండా గ్రామాల్లో గిరిజనులు హోలీ, కామదహనం వేడుకలను మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు ఘనంగా జరుపుకున్నారు. తండాల్లో సుమారు వారం రోజులపాటు నిర్వహించే హోలీ వేడుకల్లో చివరిరోజు యువకులు సంప్రదాయ బద్ధంగా అడవికి వెళ్లి తెచ్చిన కట్టెలతో తెల్లవారుజామునే కాముడిని కాల్చుతూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా తండాల పెద్దలు మాట్లాడారు. ప్రతి ఏటా హోలీని సంప్రదాయ బద్ధంగా చెడుపై మంచి సాధించే విధంగా గిరిజనులమంతా సంబరాలు జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జగన్‌నాయక్, ఎంపీటీసీ దరావత్ శౌరీనాయక్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బాబునాయక్, మాజీ సర్పంచ్‌లు దరావత్ బాలునాయక్, గోవింద్‌నాయక్, శాంతినాయక్, నవీన్‌నాయక్, కోటానాయక్, వెంకటరాంనాయక్, సైదానాయక్, డీఆర్‌డీఓ సైంటిస్ట్ రంగానాయక్, ట్రాన్స్‌కో ఏడీఈ బాబునాయక్, ఏఈ బాలునాయక్, డిప్యూటీ తహసీల్దార్‌లు భరత్‌నాయక్, రాందాస్‌నాయక్, సైదా, పులిసింగ్, తదితరులు పాల్గొన్నారు.

పేద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హుజూర్‌నగర్ : పేద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆదర్శ నాట్యకళా మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రాములు, ఆర్.రామారావు అన్నారు. బుధవారం ప్రపంచ రంగస్థలం దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అర్హులైన పేద కళాకారులను గుర్తించి వారికి పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కళలను ప్రజల కోసం ప్రదర్శించాలని, సమాజాన్ని చైతన్య పరిచే విధంగా ఉండాలన్నారు. సమావేశంలో మండలి నాయకులు ఎస్.రాములుగౌడ్, ఎస్‌కే.జాన్‌సైదా, భద్రాచలం, జి.శ్రీను, వెంకటేశ్వర్లు, అన్నమ్మ, గురవయ్య, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థలం దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు డి.సత్యనారాయణ, జె.గోవిందు, బి.రామారావు, ప్రసాద్, కిషోర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయం


ఎంపీటీసీలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వరప్రసాద్‌రెడ్డి తదితరులు

కోదాడరూరల్ : రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిమిర్యాల, నల్లబండగూడెం గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు కలకొండ సౌజన్య, యరమాల క్రాంతికుమార్‌ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న నాయకులకు ఆ పార్టీపై నమ్మకంలేకనే ఎవరిదారివారు వెతుక్కుంటున్నారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో ఆ పార్టీ నాయకులు, కొందరు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకూటమి అభ్యర్థులు గెలుపొంది కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణి, పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావు, ముత్తవరపు పాండురంగారావు, ఇర్ల సీతరాంరెడ్డి, అమరనాయిని వెంకటేశ్వరరావు, అంబేద్కర్ తదితరులు ఉన్నారు.

రంగస్థల కళాకారుడికి ఘన సన్మానం


గుంటి పిచ్చయ్యను సన్మానిస్తున్న నాయకులు

మునగాల : ప్రపంచ రంగస్థల కళాకారుల దినోత్సవం సందర్భంగా మఠంపల్లి మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు గుంటి పిచ్చయ్యను బుధవారం మండలంలోని నరసింహాపురంలో సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఒక పక్క ప్రభుత్వ ఉద్యోగిగా (విద్యుత్‌శాఖలో) విధులు నిర్వర్తిస్తూ నటనపై ఉన్న మక్కువతో ఎన్నో వందల నాటక ప్రదర్శనలు చేసి ఎన్నో అవార్డులను సొంతం చేసుకొని లిమ్కా బుక్ అవార్డుకు ఎంపికైన గుంటి పిచ్చయ్యను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన బొమ్మ సైదులు, బుద్ధి సురేష్, కారింగుల ఉపేందర్, బారి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సమాజానికి కృషిచేయాలి

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ మెరుగైన సమాజాన్ని నిర్మించేందుకు కృషిచేయాలని, భావిభారత ఆరోగ్యం మనందరి చేతుల్లోనే ఉందని ప్రజాకళాకారుడు బాదె నర్సయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని కీతవారిగూడెంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. మండలంలోని 11మేజర్ కెనాల్ పక్కన ఏర్పాటు చేసిన ఓ క్రషర్‌మిల్లుతో వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, శబ్ద కాలుష్యం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. క్రషర్‌మిల్లుతో చుట్టు పక్కల ఉన్న పొలాలు దిగుబడి తగ్గిపోవడంతో పాటు భూగర్భ జలాలు పడిపోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సోములు, రాములు, భిక్షం, రామయ్య, వెంకయ్య, మల్లయ్య, పాపయ్య పాల్గొన్నారు.

అన్నదాన సత్రం కమిటీ ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో గల రెడ్డి నిత్యాన్నదాన సత్ర కమిటీ సమావేశాన్ని నూతన అధ్యక్షుడు సాముల వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన బుధవారం స్థానికంగా నిర్వహించారు. ఈ సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఎన్నికైన 35మంది కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. రానున్న శ్రీస్వామి కల్యాణోత్సవాలకు సత్రంలో వేలాదిమంది భక్తులకు భోజన వసతి కల్పించేందుకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో సత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి చిట్టెంరెడ్డి నాగిరెడ్డి, కోశాధికారి ఆర్.వెంకటరెడ్డి, మధిర ప్రతాపరెడ్డి, సుంకి చౌదరిరెడ్డి, చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, శివారెడ్డి, నరసింహారెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

వేములూరు రిజర్వాయర్ పూడికతీతకు సర్వే ప్రారంభం


సర్వేలో పాల్గొన్న డీఈ, ఏఈ, రైతులు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిల్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్‌లో సుమారు 40ఏళ్లుగా పేరుకుపోయిన పూడిక తొలగింపునకు మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో నీటిపారుదల ఇంజనీరింగ్ అధికారులు డీఈఈ గన్నా భిక్షం, ఏఈఈ తుమ్మల శ్రీనివాసరావు బుధవారం సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిజర్వాయర్‌లో పేరుకుపోయిన పూడికతో నీటి పరిమాణం తగ్గిపోతుందని, సర్వే అనంతరం పూడికతీతకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కాగా గతంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంలో రూ.9కోట్లతో కుడి, ఎడమ కాల్వలను ఆధునీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక రైతులు నాయకులు, వంటిపులి శ్రీనివాస్, కుక్కల నాగరాజు, బండి వెంకటరెడ్డి, షేక్ సలీం, మాజీ సర్పంచ్ బుడిగె కాశయ్య, రాచమల్ల సైదులు, జక్కుల గురువయ్య, బుడిగె నాగులు, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్‌గా కృష్ణప్రసాద్


నియామకపత్రం అందజేస్తున్న మహేష్‌గౌడ్

గరిడేపల్లి : మండల కేంద్రానికి చెందిన బచ్చలకూరి కృష్ణప్రసాద్ యూత్ కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్‌గా నియమితులైనట్లు నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కడపు మహేష్‌గౌడ్ తెలిపారు. బుధవారం మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన మండల నాయకులకు, యూత్ కాంగ్రెస్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

హుజూర్‌నగర్ : అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, అందుకు పోలీస్ శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేస్తుందని సీఐ చరమందరాజు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం సీఐ ఆధ్వర్యంలో పట్టణంలో పోలీసులు, పారామిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడరూరల్ : పట్టణంలోని ఎంఎస్ కళాశాలలో అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలిటెక్నిక్, టీఎస్‌ఆర్‌జేసీ కోచింగ్ సెంటర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ అన్నారు. బుధవారం ఆయన కోచింగ్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. అడ్మిషన్లు వచ్చేనెల 1నుంచి ప్రారంభంకానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాతంగి ప్రభాకర్‌రావు, కుడుముల స్వామిదాస్, కొంగల వెంకటేశ్వర్లు, పిడమర్తి వెంకటేశ్వర్లు, బుచ్చారావు, శౌరి, చెరుకుపల్లి కిరణ్, గుర్వయ్య తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

మఠంపల్లి : గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని మాజీ సర్పంచ్ బోగాల పిచ్చిరెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి వీరారెడ్డి అన్నారు. బుధవారం మండలంలో అల్లీపురంలో కబడ్డీ క్రీడాకారులకు స్థానిక పిల్లి వివేక్‌మణికంఠ ఆధ్వర్యంలో అందించిన క్రీడా దుస్తులను పంపిణీ చేసి మాట్లాడారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

కోదాడరూరల్: కోదాడ పట్టణ శివారులోని న్యూవిజన్ స్కూల్ సమీపంలో హైదరాబాద్-విజయవాడ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వాహనాలు మృతదేహం పైనుంచి వెళ్లడంతో ఛిద్రమైంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఛిద్రమైన మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడు మతిస్థిమితం లేని వ్యక్తి లేదా భిక్షాటన చేసే వ్యక్తి అయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు ప్రమాణస్వీకారం

హుజూర్‌నగర్ : ఇటీవల ఎన్నికైన హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నేడు పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పురప్రముఖులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పెంచిన టెట్ ఫీజును తగ్గించాలి

నేరేడుచర్ల : పెంచిన టెట్ పరీక్ష ఫీజులను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోమట్రాజు వెంకట్ బుధవారం డిమాండ్ చేశారు. ఫీజు పెంచడంతో పేద నిరుద్యోగులపై అదనపు భారం పడుతుందన్నారు. ఒక పేపరుకు వెయ్యి, రెండు పేపర్లుకు రూ.2వేలు పెంచడం సరికాదన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

నడిగూడెం : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాది మంత్రిప్రగడ రాజారాం కోరారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బాలికా సాధికారతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధన విజయలక్ష్మి, ఎంఎస్ సీఈఓ ఎస్ఎస్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

గాలికుంటు నివారణకు టీకాలు వేయించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామాల్లో రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లక్కవరంలో పశువులకు ఆయన ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి మాట్లాడారు.

హేమ్లాతండాలో వైద్యశిబిరం

మేళ్లచెరువు : మండలంలోని హేమ్లాతండాలో బుధవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వేణుగోపాల్, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

మేళ్లచెరువు : మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సహకార కేంద్ర బ్యాంకు సేవలను వినియోగదారులు, రైతులు వినియోగించుకోవాలని మేనేజర్ సతీష్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు ద్వారా వ్యవసాయ అనుబంధ రుణాలతో పాటు గోల్డ్‌లోన్, ఫిక్స్‌డ్ డిపాజిట్ లాకర్ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌రఫీ ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్ఐ ఈటె సైదులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రూ.50వేల లోపు నగదు మాత్రమే వెంట తీసుకెళ్లేందుకు అనుమతి ఉందని, ఆధారాలు లేకుండా ఎక్కువ నగదు తీసుకెళ్లొద్దన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

నడిగూడెం : గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ జి.అజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని బృందావనపురంలో ఓ బెల్టుషాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారంతో ఆయన తనిఖీ చేశారు.

ప్రశంసపత్రం అందజేత

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన శ్రీకాకుళం శ్రీనివాస్ ఇటీవల మృతి చెందడంతో అతడి నేత్రాలను వారి కుమారులు మిర్యాలగూడెంలోని డైమండ్ నేత్ర నిధికి అందజేశారు. బుధవారం డైమండ్ నేత్ర నిధి వారు అతడి కుటుంబానికి ప్రశంసపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఊరే వెంకయ్య, ఉప్పల రామ్‌నరేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో గల మసీదులో బుధవారం మాజీ కౌన్సిలర్ వి.ఎల్లమ్మ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమలో గౌడ సొసైటీ అధ్యక్షుడు వి.కృష్ణగౌడ్, ముస్లిం మతపెద్దలు రహీం, మౌలానా, కాసీం, జానీ, బషీర్, రసూల్, సత్తార్, యూసఫ్, మీరా, పాషా, జహీర్, తదితరులు పాల్గొన్నారు